ప్రజాశక్తి

బుధవారం 21 మే 2025

5

అల్లూరి సీతారామరాజు

మ్యూజికల్ చైర్ పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:-వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులు, చిన్నారులకు మ్యూజికల్ చైర్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా దృష్టి సారించాలని గ్రంధాలయ అధికారిని ఎస్ సునీత చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుతున్న విద్యార్థులు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కార్మికుల సమ్మె విజయవంతం

- కలెక్టరేట్ వద్ద నిరసన - మద్దతు తెలిపిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి -పాడేరు:తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ లో పనిచేస్తున్న కెప్టెన్, డ్రైవర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఒక్కరోజు సమ్మె అల్లూరు జిల్లా కేంద్రం పాడేరులో విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆఫీస్ గేటు వద్ద నిరసన నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్కు తమ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు కె వాసు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 500 మంది కార్మికులు గత తొమ్మిది సంవత్సరాలుగా అరబిందో సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ధరలు పెరుగుతున్నా వేతనాలు పెంచడం లేదని, నెలకు కేవలం ఎనిమిది వేలా800 వేతనం మాత్రమే యాజమాన్యం చెల్లిస్తుందని తెలిపారు. అది కూడా గత నాలుగు నెలలుగా వేతనాలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. చట్ట ప్రకారం యాజమాన్యం అవుట్సోర్సింగ్ డ్రైవర్లకు 18,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక సందర్భాల్లో ఉన్నత అధికారులకు, ప్రభుత్వానికి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని, అందుకే ఆందోళన బాట పట్టామని తెలిపారు. చట్ట ప్రకారం సెలవులు ఇవ్వ లేదని పని ఒత్తిడి తీవ్రంగా ఉందని తెలిపారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు పి దామోదర్, జిల్లా కార్యదర్శి పి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

తహశీల్దార్ తేజస్వినికి వినతిపత్రం అందిస్తున్న మట్ల వాణిశ్రీ తదితరులు

సత్యవతి కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-అడ్డతీగల : అధికారుల ఒత్తిడి కారణంగా మృతి చెందిన అంగన్వాడి కార్యకర్త సత్యవతి కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు శాంతిరాజు, ఎపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.నిర్మల డిమాండ్ చేశారు. మండల కేంద్రం గొంటువానిపాలెం సెక్టార్‌కు చెందిన లంగుపర్తి అంగన్‌వాడి కార్యకర్త సత్యవతి ఈ నెల 9వ తేదీన మృతి చెందిన విషయం విదితమే. ఆమె మృతికి కార్యాలయ సిబ్బంది, సూపర్‌వైజర్ వీరమ్మ కారణమని, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని, సత్యవతి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అడ్డతీగల తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడి కార్యకర్తలు మంగళవారం ఆందోళన నిర్వహించారు. అడ్డతీగల డిప్యూటీ తహశీల్దార్ తేజస్వినికి వినతిపత్రం అందించారు. దీనికి స్పందించిన డిటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. అంగన్వాడిల ఆందోళనకు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తీగల శ్రీనివాస్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అడ్డతీగల ప్రాజెక్టు అధ్యక్షురాలు జి.బేబీరాణి, నాయకులు పార్వతి, లక్ష్మి, చంద్రకళ, ఆశ వర్కర్ యూనియన్ జిల్లా నాయకురాలు పి.లింగామణి తదితరులు పాల్గొన్నారు.

విధులను బాధ్యతగా నిర్వర్తించాలి

- ఎస్‌పి అమిత్ బర్దర్

ప్రజాశక్తి -అనంతగిరి:నమోదైన కేసులను సత్వరమే పరిష్కరిస్తూ విధుల పట్ల బాధ్యతంగా మెలగాలని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు ముందుగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తు, రోడ్డు ప్రమాదంలో నియంత్రణ చేపట్టిన చర్యలపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు.గంజాయి అక్రమ రవాణాపై వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తూ అనుమానితులపై విచారించాలని సూచించారు. యువతి యువకులు అందిపుచ్చుకొనె విధంగా సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి .షెహబాజ్, అరకు సిఐ హిమగిరి, స్థానిక ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌పి

అరకులోయ రూరల్:అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మంగళవారం అరుకు సర్కిల్ పరిధి పరిధి అనంతగిరి, డుంబ్రిగుడ, అరకులోయ సర్కిల్ పోలీస్ స్టేషన్ లో రికార్డ్స్ లను తనిఖీ చేశారు.పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలన్నారు. గంజాయి వాహనాలను ప్రతిరోజు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు డిఎస్పి షేక్ షాహబాద్ అహ్మద్, అరకు సర్కిల్ సిఐ ఎల్ హిమగిరి, అరకు ఎస్సై జి గోపాల్‌రావు, అనంతగిరి ఎస్సై శ్రీనివాసరావు, డుంబ్రిగూడ ఎస్ఐ పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను జూలై 15లోపు పూర్తిచేయండి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి -పాడేరు: భూములు రీ సర్వే ప్రక్రియ జూలై 15 తేదీ లోగా పూర్తిచేయాలని రెవిన్యూ అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కార్ఫరెన్సు మందిరం నుండి 22 మండలాల రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులతో వారాంతపు రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీ సర్వే ప్రక్రియపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని చెప్పారు. గ్రామసభలు నిర్వహించిన తర్వాత అందిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, మ్యుటెషన్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. రీ సర్వేలో భాగంగా సంబంధిత అధికారులు లాగిన్ అయి పెండింగ్ లేకుండా చూడాలని, ఎవరి లాగిన్ లో పెండింగ్ ఉంటె వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత వారం నుండి ఇప్పటివరకు నిర్వహించిన సర్వే, తీసుకున్న చర్యలపై ఆరా తీసారు. ప్రతి వారం సమీక్షకు ముందుగానే తహసిల్దార్లు సంబంధిత సిబ్బందితో సమీక్షించి సమీక్షకు పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు. రెవెన్యు సదస్సులలో అందిన విజ్ఞాపనలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలకు అందిన ధరఖాస్తులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మారు మూల ప్రాంతాలలో రేషన్ సరుకులు అందటం లేదన్న ఫిర్యాదులు అందుతున్నాయని, అదేవిధంగా డిఎంయు వాహన దారులు రేషన్ పంపిణీలో డబ్బులు కలెక్ట్ చేస్తున్నట్లు కూడా దృష్టికి వచ్చిందని, తహసిల్దార్లు నిఘా పెంచి పర్యవేక్షించాలని ఆదేశించారు. సెల్ టవర్లు పెరిగి సిగ్నల్ వ్యవస్థ మెరుగు పడినందున ప్రస్తుతం ఆఫ్ లైన్ లో ఉన్న ఎఫ్ పి లను ఆన్ లైన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి ఆర్ ఓ కె.పద్మలత, ఎస్డిసి ఎం. వి. ఎస్.లోకేశ్వరరావు, సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు, 22 మండలాల తహశీల్దారులు సర్వేయర్లు, వి ఆర్ ఓలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి

చింతూరులో రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న కారంసాయిబాబు తదితరులు

ఆదివాసీ జెఎసి రిలే నిరాహార దీక్షకు మద్దతు

ప్రజాశక్తి - రంపచోడవరం: నియోజకవర్గం రంపచోడవరం ఐటిడిఎ ఎదురుగా ఆరో రోజు రిలే నిరాహారదీక్ష కార్యక్రమాన్ని ఆదివాసి జెఎసి రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యులు కంగాల శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసి కొండదొరల సంఘ అధ్యక్షులు దూసరి హరిబాబు మాట్లాడుతూ వందశాతం స్థానిక ఆదివాసీ పట్టభద్రులతోనే భర్తీ చేసేందుకు ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని తక్షణమే (టిఏసి) ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిఒ నంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. 29 శాఖలలో ఖాళీగా ఉన్న ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఐటిడిఎల ద్వారా ట్రైకార్ రుణాలు నిరుద్యోగ యువతకు మంజూరు చేసి ఉపాధి కల్పించాలన్నారు. ఆదివాసి జెఎసి తలపెట్టిన రిలే నిరాహారదీక్షలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. ఆదివాసి జెఎసి మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేయాలి

చింతూరు : జిల్లాలోని చింతూరులో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆరో రోజు ఎర్రంపేట పెసా కమిటి ఉపాధ్యక్షులు కారం సాయిబాబు మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ3ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరణ చేయాలన్నారు. జెఎసి డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా ఆదివాసులను మోసం చేస్తూనే ఉందని, ఈ దీక్షలకు ఆదివాసులంతా మద్దతు తెలియజేయాలని లేకుంటే ఆదివాసి సమాజం మనుగడే ఉండదని హెచ్చరించారు. రాష్ట్రప్రభుత్వం ఆదివాసీ ఎమ్మెల్యేతో ట్రైబల్ అడ్వైజరి కౌన్సిల్ ఏర్పాటు చేసి ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టంనకు సంబంధించి జెఎసి నాయకుల ఆదేశాలు వచ్చేవరకూ దీక్ష విరమించబోమని తెలిపారు. కూర మహేంద్ర, పాయం అది, మడివి దేశమ్మ, మడివి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు సర్వే

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలో 12 పీవీటీజీ గ్రామాలకు పీఎం జన్ మాన్ పథకంలో భాగంగా తారు రోడ్లు మంజూరైనట్లు వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మంగళవారం తెలిపారు. గత వారం రోజుల పాటు గ్రామాలలో పర్యటించి సర్వే నిర్వహించి నూతన తారు రోడ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం కొండలరావు మాట్లాడుతూ, మండలం లోని చీకుమద్దుల పంచాయితీ గిల్లాబడ్డు, ముసిరి పాడు, జర్రాకొండ పంచాయితీ సీసాయి పనుకు, మత్స్యపురం పంచాయితీ పెద బూరుగుల,బంగారు మెట్ట, దుర్గం పంచాయితీ వాకపల్లి, తీగలవలస పంచాయితీ నిమ్మల గొంది, పనసబంధ, పాము రాయి గ్రామాల్లో పీఎం జన్ మాన్ పథకం లో తారు రోడ్లు మంజూరుకు సర్వే జరిగిందన్నారు.పీవీటీజీ గ్రామాల్లో రోడ్డు సౌకర్యాలు లేక ఇబ్బంది పడేవారు అన్నారు.ఈ కార్యక్రమంలో కోట్న పల్లి ఎంపీటీసీ సాంబే బాలకృష్ణ, తీగలవలస ఎంపీటీసీ కొర్ర నాగరాజు, సర్పంచ్ లు కాకరి బొంజుబాబు,పాంగి బేసు,సూకూరు బొంజన్న దొర పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు, మహిళలు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయితీ కొర్రగూడ, కంజారితోట గ్రామాల్లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని సిపిఎం పంచాయతీ నాయకులు కె సుబ్బారావు, పీసా కార్యదర్శి కె దేవన్న డిమాండ్ చేశారు. మంగళవారం కొర్రగుడ, కంజరితోట గ్రామాల్లో పర్యటించి తాగునీరు సౌకర్యం కల్పించాలని నూతనంగా ఏర్పాటు చేసిన బోరు వద్ద మహిళలతో కలిసి నిరసన చేపట్టారు. కొర్రగూడ గ్రామంలో సుమారు 40 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నారన్నారు. మంచినీరు లేక ఊటగెడ్డ బురదనీరే ఆధారంగా మారిందన్నారు. వర్షాకాలం బురద నీరు తాగుతూ అనేక రోగాలకు గురి అవుతున్నారన్నారు. గతంలో అనేకసార్లు తాగు నీరు సౌకర్యం కల్పించాలని ఫిర్యాదులు చేసినప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. కుళాయి మరమ్మతులు కావడంతో పొలాలు గట్టు ఊట గెడ్డ నీరును ఆశ్రయిస్తున్నారన్నారు.కంజరితోట గ్రామంలో మంచినీటి మోటర్ రిపేరు కావడంతో నీరు అందపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటాలే శిరమయ్యకు నిజమైన నివాళి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు

ప్రజాశక్తి-విఆర్.పురం : ప్రజాసమస్యలపై పోరాటమే అమరజీవి కామ్రేడ్ కారం శిరమయ్యకు ఇచ్చే అసలైన నివాళి అని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటి సభ్యులు సోయం చిన్నబాబు అన్నారు. మండలంలోని చిన్నమట్టపల్లిలో శిరమయ్య స్థూపం వద్ద మంగళవారం ఎంపిపి కారం లక్ష్మి, భార్య కారం ముత్తమ్మ, సున్నం రాజయ్య భార్య చుక్కమ్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను సోయం చిన్నబాబు ఎగరవేశారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ శిరమయ్య భౌతికంగా దూరమైనా ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అనతి కాలంలో మాజీ ఎమ్మెల్యేలు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య, నాయకులు పూనెం సత్యనారాయణ మృతి చెందారని, అయినా వారి స్ఫూర్తితో పార్టీని ముందుకు తీసుకువెళతున్నామని, వారి ఆశయాలే మార్గదర్శకమని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు వలన ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతిఒక్క నిర్వాసితునికి పునరావాసం, నష్టపరిహారం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ 3ను తక్షణమే పునరుద్ధరించి గిరిజన ప్రాంతంలో అన్నిరకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానిక గిరిజనులకే కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్, సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, కుంజా నాగిరెడ్డి, తుర్రం బాబురావు, సీరపు తాతబాబు, గూటాల శ్రీనివాసరావు, సున్నం నాగయ్య పాల్గొన్నారు.

చిన్నమట్టపల్లిలో శిరమయ్య స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నబాబు తదితరులు

రేఖపల్లి నుంచి విజయవాడ వెళ్లే బస్సు

విజయవాడ నుంచి రేఖపల్లికి బస్

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: నాయకుల సహకారంతో ఎట్టకేలకు విజయవాడ నుండి రేఖపల్లికి బస్‌సర్వీస్ ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే గతంలో రాత్రి 8 గంటలకు రేఖపల్లి నుండి విజయవాడకి బస్ సౌకర్యం ఉండేది. విజయవాడ తెల్లవారుజాము 4 గంటలకు చేరుకునేది. రాత్రి 10:30కు విజయవాడ నుండి రేఖపల్లికి తిరిగి బస్సు ఉండేది. ప్రస్తుతం రేఖపల్లికి బస్ ఏర్పాటు చేశారు అయితే మళ్ళీ కుంటకు పొడిగించడం సరైన నిర్ణయం కాదని ప్రయాణికులు వాపోతున్నారు. కుంటకు సర్వీస్ ఉండదు. అదే సమయంలో విజయవాడ వెళ్ళే ప్రయాణికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉండదు. అందువల్ల రేఖపల్లి నుంచి విజయవాడ నడపాలని కోరుతున్నారు. వయా కుంటకు బస్సు నడిపితే ఆదాయం ఉండదని మార్పు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక జిల్లా ప్రతిపాదనను మహానాడులో ప్రస్తావిస్తా

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలనే అంశంపై కడపలో నిర్వహించనున్న మహానాడులో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే శిరీషాదేవి తెలిపారు. నియోజకవర్గంలో మినీ మహానాడు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీగా వచ్చి అంబేద్కర్ సెంటర్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రంపరోడ్డులోని మినీమహానాడు వేదిక వద్దకు వెళ్లి జ్యోతిప్రజ్వలన చేసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంపచోడవరంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కడప మహానాడులో ప్రస్తావిస్తానని ముఖ్యంగా రంపచోడవరం నియోజకవర్గ కేంద్రానికి పలు గ్రామాల లింక్ రోడ్ల నిర్మాణం, ప్రజలకు విద్య, ఆరోగ్య అవసరాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యేలు సీతంసెట్టి వెంకటేశ్వరరావు, చిన్నంబాబు రమేష్, నియోజకవర్గ అబ్జర్వర్ చెల్లిబోయిన శ్రీనివాస్, వైద్యులు జమాల్ ఖాన్, జిసిసి డైరెక్టర్ గొర్ల సునీత, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రస్ట్ ద్వారా పాఠశాలలకు నిధులు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ కమిటీ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌కు నిధులు కేటాయించి వారికి పౌష్టికాహారం అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ చైర్పర్సన్ - కం మేనేజింగ్ ట్రస్టీ అధ్యక్షతన జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ కమిటీ మొదటి సమావేశం జరిగిందిఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిభందనల మేరకు కమిటీ వెంటనే ఏర్పాటు చేసి ప్రతిపాదించాలని కన్వీనర్, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఎం. ఆనంద్ ను ఆదేశించారు. జిల్లా మినరల్ ఫౌండేషన్ నిధుల నుండి జిల్లాలో ఉన్న సుమారు 250 ఆశ్రమ పాఠశాలలకు, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ కు అవసరమైన స్టవ్ లు కొనుగోలుకు రూ.50 లక్షలు కేటాయించ నున్నట్లు తెలిపారు.

రానున్న రోజులలో విద్యార్థుల భవిష్యత్తు మెరుగుకు 8,9,10 తరగతుల విద్యార్థుల వ్యక్తిగత అభ్యాసనా నైపుణ్యాలను మెరుగు పరచడానికి సుమారు రూ.1.50 కోట్లతో మెల్బోర్న్ విశ్వ విధ్యాలయంతో టయప్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో జిలా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఎం. ఆనంద్, జిల్లా వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల అధికారులు ఎస్ఎస్ బి నంద్, ఎం. నరశింహులు, జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీ రావు, గిరిజన సంక్షేమ డిడి ఎల్. రజని, డివిజినల్ పంచాయతి అధికారి పి.ఎస్ కుమార్, డిఆర్డిఎ పిడి వి. మురళి, ఆర్ డబ్ల్యు ఎస్ ఇంజినీరింగ్ అధికారి కె. జవహర్ కుమార్, వర్చువల్ విధానంలో జేసి, ఐటిడిఎ పిఒ డా. ఎంజే అభిషేక్ గౌడ, కె. సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలో అన్ని రైతుసేవా కేంద్రాల్లో రైతు గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమం జరుగుతుందని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి ఉమాదేవి కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ అనుబంధంగా పనిచేస్తోందన్నారు. ముందుగా అర్హులైన కౌలు రైతులను గుర్తించి వారి జాబితాను రెవెన్యూ అధికారికి అందజేస్తామన్నారు. తదుపరి కౌలు రైతుల వివరాలను, పట్టాయాజమాని వివరాలను పరిశీలించి రెవెన్యూ అధికారి ఆమోదం మేరకు తహశీల్దార్ సంబంధిత రైతులకు కౌలు రైతు కార్డు ఇస్తామని దీని కాలపరిమితి 11 నెలలు మాత్రమే అన్నారు. ఇది ప్రతి సంవత్సరం తొలకరిలో జారీ చేస్తామని అర ఎకరం పైబడి సాగు చేసే రైతులు, సన్న, చిన్నకారు రైతులు దీనికి అర్హులు అన్నారు. నమోదు చేయించుకోవడం వల్ల రాయితీపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు లభిస్తాయన్నారు. పంట నష్టం వాటిల్లితే పంట నష్టపరిహారం వస్తుందన్నారు. కౌలు రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేస్తామని ఆమె తెలిపారు. విధిగా రైతులు కౌలు రైతుల గుర్తింపు కార్డులు నమోదు చేయించుకోవాలని ఆమె తెలిపారు.

గ్రామసభలో మాట్లాడుతున్న ఎంఇఒ-2 నాగభూషణం

అదనపు తరగతి గది పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు:మండలంలోని నూకరాయితోటలో పాఠశాల అదనపు తరగతిగది నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఇఒ-2 నాగభూషణం ఆదేశించారు. తరగతిగది నిర్మాణానికి సర్వశిక్ష అభియాన్ నుంచి రూ.13లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. పాఠశాల కమిటి చైర్మన్, సభ్యులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల భవనం వేగంగా పూర్తి చేయాలని తీర్మానించారు. నిర్మాణానికి కమిటి ఏర్పాటు చేశారు.

అభివృద్ధి సూచికలను నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల సూచికలు సక్రమంగా నీతి ఆయోగ్ వెబ్సైట్లో నమోదు చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం డిల్లీ నుండి నీతి అయోగ్ యంగ్ ప్రొఫెషనల్ లోకేష్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. మైక్రో ఇరిగేషన్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, గృహ నిర్మాణ శాఖ ల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి సూచికల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అభివృద్ధి పురోగతిపై డేటా ఎంట్రీ సక్రమంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కాఫీ, పసుపు, మిరియాల పంటలకు ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. వైద్య ఆరోగ్య సేవలు, అంగన్వాడీ సేవలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మిస్తున్న రహదారులను నీతి అయోగ్ వైబ్ సైట్లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి . జమాల్ బాషా, జిల్లా వ్యవసాయా ధికారి ఎస్. బి. ఎస్.సంద్, ఐసిడి ఎస్ పిడి పి. సూర్యలక్ష్మి, ఎపి ఎంఐపి పిడి రహీమ్, గహ నిర్మాణ శాఖ ఇ ఇ బి. బాబు, సిపి ఓ ఎస్ ఎస్ ఆర్ కె పట్నాయక్ పాల్గొన్నారు...

వచ్చేనెల 21న యోగా డే నిర్వహించాలి

పాడేరు: వచ్చేనెల 21న అంతర్జాతీయ యోగా డే పురష్కరించుకుని యోగాంధ్ర 2025లో భాగంగా ఈ నెల 21 నుండి వచ్చే నెల 21 వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో యోగ ప్రాక్టీసు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. ఈ నెల 21 న యోగ శిక్షణ మాస్టర్ ట్రైనీలను గుర్తించి శిక్షకులకు శిక్షణ ఇవ్వాలని, వారి ద్వారా అందరికీ శిక్షణ అందించాలని ఆదేశించారు. అందుకు సంబందించి ఏర్పాటు చేసిన పోర్టల్‌లో వివరాలు అప్ లోడ్ చేయాలన్నారు.ఈ నెల 21 నుండి 27వరకు శిక్షణలు పూర్తి చేయాలని, 28 నుండి జూన్ 3 వరకు మండల స్థాయిలో, జూన్ 4 నుండి 10 వరకు గ్రామ స్థాయిలో శిక్షణలు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 21 తరువాత వంద రోజులు యోగ ప్రాక్టిస్ చేసిన బృందాలకు ధృవపత్రాలతో పాటు ప్రోత్సాహకం అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో వర్చువల్ విధానంలో జేసి, ఐటిడిఎ పిఒ ఎంజే అభిషేక్ గౌడ, కె. సింహాచలం, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఎంపిడిఓలు, కలెక్టరేట్ నుండి సిపిఒ ఎస్ఎస్ఆర్ పట్నాయక్, ఎపి ఎస్ డి పి ఎస్ కన్సెల్టెంట్ డి సాయి బొంది, జిల్లా వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల అధికారులు ఎస్ఎస్ బి నంద్, ఎం. నరశింహులు, జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మజీ రావు, గిరిజన సంక్షేమ డిడి ఎల్. రజని, డివిజినల్ పంచాయతి అధికారి పి.ఎస్ కుమార్, డిఆర్డిఎ పిడి వి. మురళి, ఆర్ డబ్ల్యు ఎస్ ఇంజినీరింగ్ అధికారి కె. జవహర్ కుమార్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : కించాయి పుట్టు పట్టు గ్రామ సమీపంలోనీ మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు మంగళవారం ఢీ కోవడంతో నీలాంబరం అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని మాకవరం పంచాయతీ అల్లంగిపడ గ్రామానికి చెందిన కుయిలొంగి. నీలాంబరం, భార్య అనురాధ, ఐదేళ్ల చిన్నారి అమృతలు స్వగ్రామం నుండి మండల కేంద్రానికి వచ్చి తిరుగు వెళుతుండగా కించాయి పుట్టు పట్టు గ్రామ సమీపంలోనీ మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కోనడంతో నీలాంబరం అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ద్విచక్ర వాహనం నడుపుతున్న బొండపల్లి గ్రామానికి చెందిన పలాస పూర్ణ, బాణాల వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావుకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు అంబులెన్స్ లో ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాధితులను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్లపై

రాష్ట్ర కేబినెట్‌లో ప్రస్తావనేదీ ?

మాట్లాడుతున్న బాల్ దేవ్

ప్రజాశక్తి- అరకు లోయ: మే 20 తేదీన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆదివాసుల వంద శాతం రిజర్వేషన్ ఉద్యోగ ఉపాధ్యాయ నియామక చట్టం పై కనీసం ప్రస్తావన చెయ్యక పోవడం అన్యాయమనీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల కార్యదర్శి గతుం బుచ్చిబాబులు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్ నియామకాలు, మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులు మినహాయించి ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ ఇవ్వాలని ఆదివాసులు ఆందోళ చేస్తున్నా రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చ లేకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజన సంక్షేమ శాఖ సమీక్ష సందర్భంగా మూడు అప్షన్లు పరిశీలిస్తున్నట్లు ప్రకటించారని, ఆ దిశగా చర్యలు లేకపోవడం ఆదివాసులకు అన్యాయం చేయడమేనన్నారు. ఆదివాసులకు న్యాయం జరగాలంటే ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

రాష్ట్ర కేబినెట్ సమావేశంలో మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులు మినహించాలని ఆదివాసులు డిమాండ్ చేస్తున్నా క్యాబినెట్ సమావేశంలో ఎటువంటి చర్యలు తీసుకోక పోవడాన్ని దుర్మార్గమన్నారు. డీఎస్సీ దరఖాస్తు గడువు ముగిసిన ప్రభుత్వం జోక్యం చేసుకోలేదని మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులు మినహించి ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు

నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన పలుచోట్ల కార్మికుల నిరసన : జూలై 9 సమ్మె జయప్రదానికి పిలుపు

మ్యూజియం గేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

దుంబ్రిగుడలో నిరసన చేపడుతున్న ఆశాకార్యకర్తలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు మండల నాయకులు దాడి రాజు పిలుపునిచ్చారు.ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో ఐటిడీఏ ట్రైబల్ మ్యూజియం ఎదురుగా కార్మికులు సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు కట్టు బానిసలుగా మిగులుతారని తెలిపారు.పూర్వీకులు పోరాడి సాధించిన హక్కులు, చట్టాలు పూర్తిగా నాశనం చేస్తున్నారని తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై జులై 9న కార్మిక సంఘాలు చేపట్టే దేశవ్యాప్త సమ్మె ను కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వంతల రాజు, గోవింద్, కమల, దినేష్, పి బాలక్రష్ణ, సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ:కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూలై 9న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిలుపునిచ్చారు. స్థానిక మండల కేంద్రంలో ఆశ కార్యకర్తలతో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం చెల్లించి, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ 26వేలు చెల్లించి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రేడ్ - 2 హెచ్ఎంల బదిలీ ప్రక్రియ

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలోని గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయుల బదిలీ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తప్పనిసరి బదిలీ అయ్యేవారు, బదిలీ కోరువారు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రాభివృద్ధికి కృషి

మినీ మహానాడులో దొన్నుదొర

మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి దొన్ను దొర

ప్రజాశక్తి -అరకులోయ:తెలుగుదేశం ప్రభుత్వ హాయంలోని రాష్ట్ర అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ అరకు నియోజకవర్గ ఇంచార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దున్ను దొర అన్నారు. అరకులోయలోని పర్యాటక శాఖ పున్నమి అతిథి గృహం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన మినీ మహానాడు సభలో తెలుగుదేశం అరకు పార్లమెంటు పరిశీలకులు హర్షవర్ధన్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి సబ్బవరపు గణేష్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి అన్ని విధాలుగా సంక్షేమ ఫలాలు అభివృద్ధి పలాలు అందించింది ప్రభుత్వమేనని వారు అన్నారు. ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వం ప్రజలకు అనువైన సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని వారు అన్నారు.డోలిమోత లేని గ్రామాలు చూడాలన్న ఉద్దేశంతో అన్ని గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పనకు ప్రణాళిక రూపొందించాలని మంత్రి లోకేష్ నివేదిక కోరినట్లు దొన్ను దొర అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పంచాయితీల్లో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగిరించాలని వారు పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే నిస్వార్ధంగా సైనికుల పని చేయాలని వారు పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం లభిస్తుందని కమిటీల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ప్రతినిధులు రామన్న, పెట్టేలి దాసు బాబు, శెట్టి బాబు రావు, బూర్జలక్ష్మి, శెట్టి లక్ష్మణుడు, గడ్డంకి రామ్మూర్తి, సికరి కుమారి, తుడుం సుబ్బారావు, పెట్టేలి రాము తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో కెరీర్ అవకాశాలు

- 23న మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఉచిత వెబినార్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విద్యా కార్యక్రమాల్లో ఇంటర్న్‌షిప్ ముఖ్య ఘట్టమని ఆంధ్రా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. కిషోర్‌బాబు అన్నారు. మంగళవారం సరైన ఇంటర్న్‌షిప్, ప్రకాశవంతమైన భవిష్యత్తు వెబ్‌నార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిగ్రీ ప్రోగ్రామ్ సమయంలో ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు అధ్యయన రంగంలో ఆచరణాత్మక అనుభవాన్ని ఇస్తుందన్నారు. తద్వారా విద్యార్థులకు పరిశ్రమల గురించి స్పష్టమైన అవగాహనతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు.
మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరదా రవి కుమార్ మాట్లాడుతూ, మెరుగైన కెరీర్ అవకాశాలు, సరైన నైపుణ్యాలను అభివృద్ధి చేసే ఇంటర్న్‌షిప్‌ను ఎంచుకోవడానికి విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడానికి ఈ వెబినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈ 23న నిర్వహిస్తున్న ఉచిత వెబినార్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వెబ్‌నార్‌కు గాయత్రి విద్యా పరిషత్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.కృష్ణకుమార్ ముఖ్య అతిథిగా, మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో ట్రైనర్ అండ్ అనలిస్ట్ అనురాధ విన్నకోట స్పీకర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఈ వెబ్‌నార్‌లో పాల్గొనే వారు ఈ నెల 20 నుంచి 23 వరకు సాయంత్రం వరకు కంపెనీ వెబ్‌సైట్ https: //www.millenniumsoftsol.com లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 92487 53099, 91540 84157 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా సలహాదారు కె.భవాని, బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

సిసి రోడ్లను పారంభిస్తున్న ప్రసాద్

సిసి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని రేవళ్ల పంచాయతీ, రేవళ్ల శాంతినగరంలో పది లక్షల బడ్జెట్‌తో నిర్మించిన 300 మీటర్లు సిసి రోడ్లను ఎస్టి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మాజీ జిసిసి చైర్మన్ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మేడిపోయిన చిన్న, రేవళ్ల సర్పంచ్ జనుమూరి వెంకటలక్ష్మి, కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, మండల టిడిపి ఇన్‌చార్జి కురుజు శ్రీనుబాబు, తోట దొరబాబు, మేడిపోయిన సత్తిబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, వైస్ ఎంపిపి పెంటయ్య

బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కూనవరం : మండలంలోని లింగాపురం పంచాయతీ పరిధిలో కోడేరులో రెండు బోర్లు ఏర్పాటు చేసేందుకు మంగళవారం పనులు ప్రారంభించారు. ఎంతోకాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ సోడె శంకర్ అన్నారు. వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సర్పంచ్ శంకర్ పనులను ప్రారంభించారు. దీంతో ఎంతో కాలంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారం కానుందని గ్రామస్తులు వీరిరువురికి ధన్యవాదాలు తెలిపారు. రేగులపాడు సర్పంచ్ రామారావు, బొగ్గా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జివిఎంసి) డిప్యూటీ మేయర్‌గా జనసేన కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి మంగళవారం ఎన్నికయ్యారు. విశాఖ జాయింట్ కలెక్టర్, అదనపు మెజిస్ట్రేట్, ఎన్నికల అధికారి మయూర్ అశోక్ ఆ విషయాన్ని వెల్లడించారు. ఎపి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం జివిఎంసి డిప్యూటీ మేయర్ ఎన్నిక మంగళవారం ఉదయం 11 గంటలకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం ద్వారా జరిగింది. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి కూటమి అభ్యర్థిగా జనసేనకు చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి బి.ఫారాన్ని సమర్పించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రతిపాదించగా, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బలపరిచారు. ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు మొత్తం 59 మంది హాజరుకాగా డిప్యూటీ మేయర్ ఎన్నికకు కోరం సరిపోయినందున, మరో అభ్యర్థి పోటీలో లేనందున డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరెడ్డి ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి మయూర్ అశోక్ ప్రకటించారు. అనంతరం ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కూటమి శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, పి.గణబాబు, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కార్పొరేటర్లు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, అధికారులు, సిబ్బంది నూతన డిప్యూటీ మేయర్‌కు పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ప్రపంచ రికార్డు సృష్టించేలా అంతర్జాతీయ యోగా డే

విశాఖలో లక్షల మందితో కలసి ప్రధాని యోగాసనాలు

యోగాడే నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హారేంధిరప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ప్రపంచరికార్డు సృష్టించేలా 11 వ అంతర్జాతీయ యోగాడేను జూన్ 21న విశాఖ జిల్లాలో నిర్వహించేందుకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. జూన్ 21వ తేదీన నిర్వహించనున్న యోగాడే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటున్నారని ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోందన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ యోగాడే కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు 'యోగా మంత్' పాటించాలని, ఈ నెల రోజులు జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా శిక్షణ జరగాలన్నారు. ఇందుకోసం ప్రైవేటు వ్యక్తులు, శిక్షకులు, యోగా అసోసియేషన్లు, నిపుణులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్‌ను ఈ ఏడాది యోగా దినోత్సవ థీమ్‌గా ప్రభుత్వం తీసుకుందని, అందువల్ల జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. 'యోగాంధ్ర-2025' థీమ్‌తో ప్రచారం చేపట్టి ప్రజలను సన్నద్ధం చేసేందుకు నెలరోజుల పాటు ప్రజలకు యోగాపై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా యోగాడేలో పాల్గొనే అంశంపై ప్రజల నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను, డ్వాక్రా మహిళలను, ప్రైవేటు ప్రభుత్వ సంస్థల ఉద్యోగులను, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్.కె.బీచ్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోడి, ప్రజలు పాల్గొనే ప్రాంతాల నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్ కె బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకూ అన్ని చోట్లా ప్రజలు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్.కె బీచ్ నుంచి పార్క్ హోటల్ వరకు, అదే విధంగా పార్క్ హోటల్ నుండి భీమిలి బీచ్ రోడ్ వరకూ సుమారు 2.5 లక్షల మంది యోగాలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆర్.కె బీచ్, రుషికొండ, స్కూల్స్, క్రికెట్, పోలీస్, స్పోర్ట్స్, నేవీ ప్రాంగణాలతో పాటు పలు ఖాళీ ప్రదేశాలను యోగా నిర్వహణకు గుర్తించడం జరిగిందన్నారు. అంతర్జాతీయ యోగాడే విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా జిల్లా స్థాయిలో, మండల, గ్రామ, వార్డు స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు, డ్రోన్స్, తాగునీరు, అల్పాహారం, రవాణా సదుపాయం, వాహనాల పార్కింగ్, శానిటేషన్, టాయిలెట్స్, వాలంటీర్లు ఏర్పాటు, మెడికల్ టీమ్‌ల ఏర్పాటు, అతిథులు ఉండేందుకు ఏర్పాట్లు, సిసి కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

యోగాలో ప్రపంచరికార్డ్ నెలకొల్పాలి

యోగా దినోత్సవాన్ని ప్రకటించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని పాల్గొనే 11వ అంతర్జాతీయ యోగా డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. 2023లో సూరత్‌లో 1.53 లక్షల మందితో ఒకేచోట అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించి వరల్డ్ రికార్డ్ నెలకొల్పారు. సూరత్ తరహాలో విశాఖలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించి, ఈ సారి ఆ రికార్డును తిరగరాయాలని, అందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో 2.50 లక్షల మందిని భాగస్వామ్యం చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్ల సమన్వయంతో ఆర్.కె.బీచ్ నుంచి భీమిలి వరకూ, అక్కడ నుంచి విజయనగరం జిల్లా మీదుగా శ్రీకాకుళం వరకూ సుమారు 5 లక్షల మందిని భాగస్వామ్యం చేస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

యోగ శిక్షకుల ద్వారా శిక్షణలు ప్రారంభించాలన్నారు. మాసోత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని, ఈ నెల 21వ తేదీ ఉదయం 6.30 నుంచి 8 గంటల మధ్యలో విశాఖ ఆర్‌కెబీచ్ రోడ్‌లో 1000 మందితో ప్రాథమిక వేడుకలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మే 21నుంచి మండల, గ్రామ స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు, శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. సమీక్ష సమావేశంలో డిసిపిలు మేరీ ప్రశాంతి, అజిత, రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీశంకర్‌తో పాటు జిల్లా అధికారులు, యోగా టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలి

సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను తక్షణమే నిలిపేయాలని, కార్మికుల తొలగింపుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని, రాష్ట్ర పోలీసులను ప్లాంట్ నుండి వెనక్కు రప్పించాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ప్రదర్శన, సభ జరిగాయి. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేయాలని, కార్మికుల తొలగింపులను నిలిపివేయాలని పెద్ద పెట్టున నినదించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిఎఫ్‌టియుఐ అఖిల భారత అధ్యక్షులు ఎన్.కనకారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెప్పిన రాష్ట్రంలోని కూటమి నాయకులు నేడు 5,400 మంది కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగిస్తుంటే ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను, పర్మినెంట్ కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడం, సస్పెన్షన్ చేయడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడం, మీటింగ్‌లు జరపకుండా పోలీసులను పెట్టి అడ్డుకోవడం వంటి చర్యలకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్లాంట్ లోపల సైతం పోలీసులను పెట్టడమంటే కేంద్ర ప్రభుత్వ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడమేనన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించే విధంగా, కార్మికుల ఉపాధిని రక్షించే విధంగా దేశవ్యాప్తంగా కార్మికవర్గాన్ని ఐక్యం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తల్లిబిడ్డల ఎక్స్‌ప్రెస్ కార్మికుల సమ్మెకు కూడా నాయకులు మద్దతు తెలిపారు. జులై 9న జరిగే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.మణి, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, వి.కృష్ణారావు, పైడిరాజు, ఎఐటియుసి నాయకులు ఎస్‌కె.రెహమాన్, కాసుబాబు, ఐఎఫ్‌టియు నాయకులు తిరుపతిరావు, సిఎఫ్‌టియుఎఫ్ నాయకురాలు కె.లక్ష్మి, ఐద్వా నాయకులు బి.పద్మ, వై.సత్యవతి, కొండమ్మ, కె.కుమారి, డివైఎఫ్ఐ నాయకులు యుఎస్ఎన్.రాజు, శైలజ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మ, మేరీ, ఆర్‌పి యూనియన్ నాయకులు మల్లేశ్వరి, సత్య, ఝాన్సీలతో పాటు వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

పోర్టు చైర్మన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం పోర్టు జెపి ఆఫ్ సోర్స్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ విశాఖ పోర్టు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె విజయవంతమైంది. సమ్మెలో భాగంగా మంగళవారం పోర్టుచైర్మన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు విభాగంలో జెపి ఆఫ్ సోర్స్ కాంట్రాక్టు కార్మికులు 8 నెలలుగా పని చేస్తున్నారన్నారు. కనీస వేతనాల జిఒ ప్రకారం వీరికి రూ.23వేలు వేతనం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం రూ.13,695 మాత్రమే ఇస్తున్నారని, మిగిలిన సుమారు రూ.10 వేలు కార్మికులకు చెల్లించకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రోజుకు 12 గంటలు పని చేయించుకుంటున్నప్పటికీ ఒటి కూడా ఇవ్వటం లేదన్నారు. వీక్లీ ఆఫ్, పండగ, జాతీయ సెలవులు ఇవ్వటం లేదన్నారు. పనిగంటలు 12 నుంచి 8 గంటలకు తగ్గించాల న్నారు. కార్మికులతో ఈ విధంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఇప్పటికే గత 3 నెలల నుంచి కాంట్రాక్టర్, డిసి, సెక్రటరి, చైర్మన్‌తో సహా అధికారులందరికీ తెలియజేసినప్పటికీ ఫలితం లేకపోయిం దన్నారు. అందువల్లనే ఈ రోజు నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. సమ్మెలో పాల్గొన్న వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీను, తాతబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు